# భరోసా

ఆ రోజు నన్ను విడుదల చేస్తున్నారు. నా గుడ్డలు నాకు ఇచ్చేశారు. వేసుకున్నాను, జైల్లో నేను సంపాదించుకున్న డబ్బు కూడా చేతిలో పెట్టారు, లెక్క పెట్టుకున్నాను పాతిక. తలెత్తి దారోగా కళ్ళల్లోకి చూశాను. 'అంతేనా ?' అన్నట్టు.

"ఏం అనుమానంగా ఉందా ? లెక్క చూపించనా ?" అంటున్నాడు.

అనుమానం కాదు, గట్టి నమ్మకం, ఆ ముసలి నక్క కాజేశాడని. నా లెక్క ప్రకారం కనీసం యాభయ్యేనా రావాలి. బయట ఎలా ఉన్నా, జైల్లోమాత్రం నేను చాలా బుద్ధిగా ఉంటాను. ఒళ్ళు దాచుకోను. ఏ పని చెబితే అది చేస్తాను. ఏ పేచీలు పెట్టుకోను. అందుకే శిక్షగడువు పూర్తి కాకుండానే నన్ను విడుదల చేస్తుంటారు.

ఖైదీల డబ్బు దోచుకోవడంలో దారోగాది ఆరితేరిన చెయ్యి అని ప్రతీతి. నా స్వానుభవం కూడాను. పాపం, ఏం చేస్తాడు ? బోలెడు మంది పిల్లల్ని కన్న పాపానికి ఈ చిన్నచిన్న పాపాలు చెయ్యక తప్పదు మరి. అయినా ఇది నా కొహ లెక్కా ? దేవుడు దయదలిస్తే ఒక్క రోజులో, కాదు ఒక్క పూటలో ఇంతకు రెండింతలు, మూడింతలు సంపాదించలేనూ !... మారు మాట్లాడకుండా, చిరునవ్వుతో రిజిస్టరులో సంతకం పెట్టేశాను.

'వెళ్ళొస్తాను, దార్‌గా సాబ్" అంటూ బయలు దేరాను. నాలుగడుగులు వేశానో లేదో వెనుకనించి "కరీం" అన్న పిలుపు. ఆగాను. తిరిగిచూశాను. రమ్మని సౌంజ్ఞ చేస్తున్నాడు దారోగా. వెళ్ళాను.

"కూచో" అంటూ కుర్చీ చూపించాడు. నాకు ఆశ్చర్యం వేసింది ఖైదీలను అలా కూర్చోమనటం నేను ఇంతవరకు విన్లేదు.

"నిన్నే కరీం కూచో" మళ్ళీ అన్నాడు. ఆ గొంతులో అంతటి మార్దవం ఎలా వచ్చిందో అర్థంకాక, అనుమానంగానే కూర్చున్నాను.

కొద్ది క్షణాలు నా కేసి నిశ్శబ్దంగా చూసి, అడిగాడు "ఇందాక ఏమన్నావ్ ?"

"నేనా ? .. ఏమన్నానూ ?... ఏంలేదే ?..." నాకు అంతు పట్టలేదు.

"వెళ్ళొస్తానూ అన్లేదూ ?"

'ఓ, అదా ? అవును, అన్నాను. ఏం, తప్పా ?"

"మళ్ళీరాకు."

మళ్ళీ ఆశ్చర్యపోవటం నా వంతయింది. "రావద్దా ? వస్తే మీకేం బాధ ? ..."

"బాధే. నువ్విలా మళ్ళీ మళ్ళీ రావటం నాకు బావోలేదు."

నాకు నవ్వు వచ్చింది. పెద్దగానే నవ్వేశాను.

"ఏయ్ అపు ! ఇది జేలని మరిచిపోకు. ఇక్కడలా నవ్వకూడదు."

"సారీ దారోగాసాబ్ ...కాని మీమాటలు ? నాకుమాత్రం ఇక్కడికి రావటం సరదా అనుకుంటున్నారా ?"

"మరి ఎందుకొస్తావు ?"

"నేనొస్తానా? పోలీసులు లాక్కొస్తారు. వాళ్ళకి చెప్పండి తీసుకు రావద్దని — రాను."

"వేళా కోళంగాదు."

"కాదు ; కాని ఏం చెయ్యను, దారోగా సాబ్ ! ఇక్కడికి రావటం రాకపోవటం నాచేతుల్లో ఉందా, చెప్పండి."

"ఉంది. ఆ చేతుల్ని కాస్త అదుపులో ఉంచుకో. మళ్ళీ రానవసరం ఉండదు."

మళ్ళీ నవ్వు వచ్చింది, బలవంతాన ఆపుకున్నాను.

"చూడండి, దారోగా సాబ్ ! మీకు తెలీదు — ఈ చేతులున్నాయే ఇవి నా మాట వినవు."

"మరి ఎవరి మాటలు వింటాయి ?"

"ఇదిగో...దీని...దీని మాట వింటాయి. అంటూ పొట్ట మీద అరిచేత్తో చరచుకున్నాను.

'నాకు తెలుసు, కోటి విద్యలు కూటికొరకేనని. కాని జేబులు కొట్టడం కంటే మరో మంచి మార్గం లేదా పొట్ట నింపుకోడానికి ?"

అంటే, దొంగ లెక్కలు రాసి ఖైదీల డబ్బులు కాజేయటం లాంటి మంచి పనా ? అనుకున్నాను. పైకి, "ఏంచెయ్యమంటారు?" అన్నాను.

"నువ్వు జైల్లో ఉన్నంతకాలం ఎంతో కష్టపడి పనిచేస్తావు. ఆ మాత్రం పని బయట చేస్తే చాలదూ ?'

"ఉహుఁ, చాలదు. అలా చేస్తే పొట్ట నిండితే నిండ వచ్చు కాని, రాజీ మాటో ?"

"రాజీ... రాజీ ఎవరు ?"

—

రజియా నా కళ్ళెదుట నిల్చింది.

"రాజీ నా ఆరవ ప్రాణం, సర్వస్వం. దాని కోసమే ఈ బ్రతుకు..."

"నీ భార్యా"

"కాదు."

"ప్రియురాలా ?"

"ఛ! ఛ! కాదు."

"మరీ ?"

"రజియా నాకేం కాదు. కాని — అంటాను ... నా చిన్న తనంలో దొరికింది. అప్పుడు దానికి మూడేళ్ళు. నాకు తొమ్మిది. దాని తల్లిదండ్రు లెవరో తెలీదు, నా తల్లితండ్రులెవరో అంతకన్నా తెలీదు. ఇద్దరం అడుక్కు తిని బ్రతికేవాళ్ళం. కాస్త పెద్దయ్యాక నేను మూటలుమొయ్యడం, కూలీపని చేయడం మొదలెట్టాను. ఆ తర్వాత ఒకరి ఇంట్లో నౌకరుగా కుదిరాను. అక్కడే నేను డబ్బులు కాజేయటం, జేబులుకొట్టడం నేర్చుకున్నాను. కొన్నా ళ్ళకి పట్టుబడి పోయాను. తన్ని తరిమేశారు. ఇహనేం, బజారున పడ్డాను. రాను రాను నా చేతి లాఘవం రాణించింది. మాంచిపిక్ పాకెట్‌గా తయా రయ్యాను.అప్పటిన్నించీ మేము హాయిగా ఉంటున్నాము,అప్పుడప్పుడు జైలు ఆటంకాలు తప్ప."

"మరి నువ్విక్కడున్నప్పుడు ఆ అమ్మాయి ఎక్కడుంటుందీ ?"

"ధర్మరావుగారింట్లో. ఆయన నిజంగా ధర్మదేవత.అమ్మగారు కూడా చాలా మంచిది. వాళ్ళింటో నే పని మనిషిగా కుదిరింది రాజీ. వాళ్ళకు పిల్ల ల్లేరు. స్వంత కూతుర్లా చూసుకుంటారు."

నిన్ను చూడటాని కెప్పుడూ రాదేం ?"

"అమ్మో ! ధర్మరావుగారికి తెలిస్తే ఇంకేమేనా ఉందీ ? దాన్ని తరిమివేస్తారు ఇంట్లోంచి. అప్పుడు దానికి నిలవ నీడ లేకుండా పోతుంది.

అందుకే అది ఇక్కడికి రాకుండా కట్టుదిట్టం చేశాను. అసలు నే నే జైల్లో ఉంటానో కూడా తెలీదు. విడుదలై పోగానే నను పట్టుకుని ఏడుస్తుంది. నన్నీ పని మానెయ్యమని ఒకటేగోల పెడుతుంది. ...హుఁ ! పిచ్చిపిల్ల ! ఇదంతా దానికోసమే చేస్తున్నానని ఎంత నచ్చచెప్పినా వినిపించుకోదు. దానికి అర్థంకాదు."

"నాకూ అర్థంకాలేదు దాని కోసమంటే ?'

"నేను డబ్బు సంపాదించాలి. పోగుచెయ్యాలి. బాగా పోగయ్యాక ఒక మంచి వరణ్ణి చూసి రాజీ పెళ్ళి చెయ్యాలి. అంతే, నాకు కావలసిందంతా అంతే. ఆ తర్వాత నేనేమైపోయినా సరే, ఫరవాలేదు. ఇక్కడికేవచ్చి శాశ్వతంగా ఉండిపొమ్మన్నా ఉంటాను."

దారోగా నాకేసి తదేకంగా కాసేపు చూసి, అన్నాడు "ఆ అమ్మాయి నీకేం కాదుకాదా - నువ్వే ఆమెను పెళ్ళి చేసేసుకోరాదూ ?"

"ఛీ . ఛీ ! ఎలాంటి పాపపు మాట అన్నారు, దారోగా సాబ్ ? రాజీ నా క్షేం కాకపోవట మేమిటి ? నాకు చెల్లెలు, కూతురు, రేపు నా ముసలి తనంలో నాకు కాబోయే తల్లి ! అలాంటి దాన్ని, నేను . "

"సరే, సరే, ఆవేశపడకు. నాకు తెలీక అన్నాను. పోనీ, ఆ అమ్మాయిచెప్పినట్టు ఈ పని మానేసి మరేదేనా చేసి డబ్బు కూడబెట్టలేవా ?'

'ఉహుఁ, అది అసంభవం. నాకు మరొక పని చేతకాదు. చేతనయనా దాని ద్వారా నాకు కావలసినంత డబ్బు పోగయ్యేసరికి రాజీ ముసలిదై పోవచ్చు. అప్పుడా డబ్బు ఏం చేసుకోను ? నెత్తిన కొట్టుకోనా ?... ఉహుఁ, నా ఈ చేతిలోని విద్య వల్లే డబ్బు రావాలి. లేదా లాటరీ గెలవాలి. లాటరీ టికట్టు కూడా కొంటూ ఉంటాను. కాని ఇంతవరకు ఒక్కటీ రాలేదు".

"మరి, ఇంతవరకూ ఏమైనా పోగయిందా ?"

"ఓ, పరవాలేదు, బాగానే పోగవుతోంది."

"ఎక్కడ దాస్తున్నావు ?"

"చెప్పనా ?.... ఇంతవరకు ఎవ్వరికీ చెప్పలేదు. అయినా ఫరవా లేదు. నాజీవిత గాథ విన్న మొదటి వారు మీరే. అదీ చెబుతాను. ధర్మ రావుగారి దగ్గర దాచాను. ఆయన దగ్గిరుంటే డబ్బు బ్యాంకు కంటే భద్రం."

"ఇంకా ఎన్నేళ్ళు ?"

"ఏమిటి ?"

"ఇదే — ఈ తపస్సు."

"మరో రెండు, మూడేళ్ళయితే చాలు ... లేదా, ఈ లోగా నా చేతి కేదైనా మాంచి పర్సయినా చిక్కాలి, లేక లాటరీ డబ్బయినా కొట్టాలి."

దారోగా కాసేపు మౌనంగా ఉండి, అన్నాడు. "నీ లెక్క మళ్ళీ చూస్తాను. ఇంకా బాకీ ఏమైనా తేలుతుందేమో..."

"ఒద్దొద్దు, దారోగాసాబ్‌నాకింకేం ఒద్దు. మీకూ పిల్లలున్నారు. నాకేమైనా తేలితే వాళ్ళకి నా తరఫున ఏదైనా కొనివ్వండి. వస్తా" అంటూ లేచాను.

"అదిగో, మళ్ళీ అదేమాటన్నావా?" అన్నాడు నవ్వుతుంటూ.

నాకూ నవ్వు వచ్చింది. "తప్పదు, దారోగాసాబ్, తప్పదు అంటూ వచ్చేశాను.

నేను దారోగాతో చెప్పింది నిజమే. ఏ జైల్లో ఉండేది, ఎప్పుడు విడుదలయ్యేది రాజీకి ఎప్పుడూ తెలియనివ్వను. అయినా ప్రతిసారీ భ్రమలో పడతాను, జైలు గేటు ఆవల రాజీ నాకోసం వేచి ఉంటుందని. ఈ సారి జైల్లో చాలా రోజులున్నానేమో, మరీ ఆత్రంగా ఉంది రాజీని చూడాలని,

గేటు దాటగానే, అప్రయత్నంగా దృష్టి నలువేపులా పోయింది. ఒక్కసారి నా గుండె ఆగినట్టనిపించింది. ఎదురుగా రాజీ!! కాని, కాని... ఇదేమిటి? రాజీ చేతికి సంకెళ్ళు.. ప్రక్కనే పోలీసు వాను, పోలీసులు. "రాజీ!" అన్న గావుకేక వెలువడింది.

రాజీ ఉలిక్కిపడి ఇటు చూసింది. "భయ్యా!" అంటూ అరిచి నా వేపు పరుగెత్తబోయింది. కాని మేము కలుసుకోకుండా పోలీసులు అడ్డు పడ్డారు. రాజీ వెక్కివెక్కి ఏడుస్తోంది.

"ఏమైంది, రాజీ! ఏమైంది?" ఆదుర్దాగా అడిగాను. రాజీ చెప్పే స్థితిలో లేదు. ఏడుపు ఎక్కువైంది.

"హత్య చేసింది" అన్నాడు ఒక పోలీసు.

"ఆఁ?... హత్యా! నువ్వా, రాజీ?..."

అవును, అవునంటూ తల ఊపుతోంది.

"ఎవర్ని? .. ఎవర్ని హత్య చేశావు, రాజీ?"

"వాణ్ణే ఆ దుర్మార్గుడు... వాడు... వాడు .. నన్ను .. నన్ను..." చెప్పలేకపోయింది.

"చెప్పు, రాజీ! చెప్పు. ఎవరు వాడు? ఎవరు?"

"వాడే, భయ్యా! వాడే... ధర్మారావు."

"ఆఁ?... ధర్మారావా?... ధర్మదేవత ధర్మారావా?..." నా కళ్ళు బైర్లు కమ్మాయి. అచేతనంగా నిలుచుండిపోయాను...

నేను తేరుకునేసరికి రాజీ అక్కడ లేదు. జైలు తలుపులు మూసుకున్నాయి.

నా జీవిత కవాటాలు కూడా మూతపడ్డాయి.

(ఆంధ్రప్రభ వారపత్రిక : 19-7-78)